# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.**
2. **సాంకేతికత ద్వారా ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**
3. **సికిల్‌సెల్ అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తిచేసేందుకు చర్యలూ తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు.**
4. **ప్రముఖ సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ వర్ధంతి ఈరోజు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో ఏనుగుల దాడులపై చర్యలు తీసుకుంటున్నామని తెలుపుతూ..

..వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రయాణి కులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –ఏపీఎస్ఆర్టీసీ 'గవర్నెన్స్ నౌ పీఎస్ యూ ఐటీ ' పురస్కారాన్ని అందుకుంది. ఈ పురస్కారానికి ఏపీఎస్ఆర్టీసీ ఎంపిక కావడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈరోజు విజయవాడలో ఆయన మాట్లాడుతూ, యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్ల జారీ విధానం, బస్సుల ట్రాకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసినందుకు ఆర్టీసీ ఈ అవార్డుకు ఎంపికైందని తెలిపారు. సాంకేతికతను వినియోగించుకుని ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని, రానున్న రోజులలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ అనీమియా స్క్రీనింగ్ పరీక్షలను త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న 19 లక్షల మంది గిరిజనులకు గాను ఇప్పటి వరకు 9 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయినట్లు తెలిపారు. మిగిలినవారికి పరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలను తీసుకోవాలని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన సుమారు 13వేల మంది విద్యార్థులకూ స్క్రీనింగ్ పరీక్షలను నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. 21 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగినవారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సికిల్‌సెల్ యాప్‌లో కార్డుల పంపిణీ వివరాల నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

--------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ప్రసాదాలలో పలాస జీడి పప్పును వినియోగించడం హర్షణీయని కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి వినియోగించేందుకు ఏర్పాటు చేసిన జీడి పప్పు లారీని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీషలతో కలిసి కేంద్రమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదాలలో పలాస జీడి పప్పును వాడటం ఈ ప్రాంతానికి దక్కిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా జీడిపప్పును గ్రేడింగ్ చేయడంతో పాటు ఎక్కువకాలం నిల్వ ఉండేలా జీడి పప్పు తయారు చేశారని మంత్రి తెలిపారు.

--------------------------

చిత్తూరు పార్లమెంట్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిత్తూరు కలెక్టర్ తోపాటు, చిత్తూరు శాసనభ్యులు గురజాల జగన్మోహన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, పార్లమెంట్ పరిధిలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, ప్రధానమంత్రి గ్రామ సడక్ యువజన పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పేదలకు సొంత ఇంటిని నిర్మించడం వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

--------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ వర్ధంతి ఈరోజు. అప్పటి బెంగాల్ ప్రెసిడెన్సిలో 1772 మే 22వ తేదీన జన్మించిన ఆయన... సతీ సహగమనం రూపుమాపడానికి విశేష కృషి చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. వితంతు పునర్ వివాహానికి మద్దతు ఇచ్చారు. మహిళా విద్య కోసం అవిరాళ కృషి చేశారు. బ్రహ్మ సమాజాన్ని స్థాపించి, ఆంగ్ల విద్యకు అనుకూలంగా ఉండి, దేశంలో ఆంగ్ల విద్యా విధానానికి కృషి చేశారు. 1833 సెప్టెంబరు 27వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్

కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి –సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తిరుమల స్వామివారిని దర్శించుకోనున్నారని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. రేపు సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని, రాత్రి తిరుపతిలోనే బస చేసి ఎల్లుండి ఉదయం తిరుమలకు చేరుకుని శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటారని చెప్పారు. సీజేఐ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసున్నామని తెలిపారు.

-----------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ రోజు తిరుపతిలో పర్యటించనున్నారు. ఈరోజు సాయంత్రం తిరుపతికి చేరుకున్న ఆయన రేపు రాత్రి తిరుమలకు చేరుకుని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

-----------------------------

తిరుపతి జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున ర్యాలీలు, సభలు నిర్వహించేందుకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా సభలు, ఊరేగింపులు నిర్వహించవద్దని సూచించారు. ర్యాలీలు, సభలు, భేటీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నెలరోజులపాటు ఆంక్షలు అమల్లో ఉంటాయని ఎస్పీ పేర్కొన్నారు.

-----------------------------

తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి చెత్త సేకరణ వాహనాలలో వేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ప్రజలకు సూచించారు. ఈ రోజు కాకినాడ నగరంలోని గాంధీనగర్ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను కమిషనర్ తనిఖీ చేశారు. చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి కేంద్రాలుగా తయారవుతాయని దీనివల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు.

-----------------------------

మంకీపాక్స్ వ్యాధికి సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. ఈ వ్యాధి నివారణ, నియంత్రణ పద్ధతులు పాటించాలని, అనుమానిత వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని మంత్రిత్వ శాఖ సూచించింది. రాష్ట్ర, జిల్లా స్థాయిలలోని ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించాలని, వ్యాధి అనుమానిత వ్యక్తులకు ఆసుపత్రులలో ఐసోలేషన్ సౌకర్యాలను కల్పించాలని తెలిపింది.

-----------------------------

ఇసుక రవాణాకు పేర్లు నమోదు చేసుకున్న వారికి వేగంగా ఇసుకను అందించేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశిం చారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన

ఉచిత ఇసుక విధానం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా ఆలస్యం లేకుండా త్వరితగతిన ఇసుక రవాణా జరిగేలా ఇసుక రవాణా వాహనదారులు సహకరించాలని కోరారు. ఇసుక దిబ్బల నుంచి వినియోగదారుల ఇంటి వద్దకే ఇసుకను రవాణా చేసిన వాహనాలకు జాప్యం లేకుండా సంబంధిత రుసుమును నేరుగా ఖాతాలో జమచేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.

======================